## కాంగ్రెస్ ప్రభుత్వం హామీలన్నింటినీ అమలు చేయాలి

**సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్**

బేగంపేట్, డిసెంబర్ 19 : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని, లేని పక్షంలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఉదయం మారేడ్‌పల్లిలోని తన నివాసంలో జరిగిన పార్టీ నియోజకవర్గం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ ఆచరణకు సాధ్యంకాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమల్లోకి తీసుకువచ్చి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. తన గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒకరికీ, కాలనీ, యువజన, మహిళా సంఘాల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. అన్ని వర్గాల ప్రజల అండతోనే తన విజయం సాధ్యమైందన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన అభివృద్ధి పనులు తిరిగి ప్రారంభమవుతాయని, అదేవిధంగా కొత్తగా మంజూరైన పనులు సంక్రాంతి తరువాత



సమావేశంలో మాట్లాడుతున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్

ప్రారంభిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్‌యాదవ్, కార్పొరేటర్లు మహేశ్వరి, హేమలత, మాజీ కార్పొరేటర్లు అత్తెల్లి అరుణ, ఎన్.శేషుకుమారి, ఆకుల రూప, కిరణ్మయిలతో పాటు డివిజన్ల అధ్యక్షులు ఆకుల హరికృష్ణ, కొలను బాల్‌రెడ్డి, అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్, హన్మంతరావు, శ్రీనివాస్‌గౌడ్ లతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## గచ్చిబౌలిలో ఉత్సాహంగా వీల్ చైర్ సల్సా



వీల్ చైర్ సల్సా కార్యక్రమంలో ఉత్సాహంగా స్టెప్పులు వేస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి, డిసెంబర్ 19: గచ్చిబౌలిలోని ఉచ్ఛ్వాస్ టాన్సిషనల్ కేర్ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన చైర్ సల్సా కార్యక్రమం వీల్ చైర్ రోగుల్లో నూతన ఉత్తేజాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో ఉచ్ఛ్వాస్ ట్రాన్సిషనల్ కేర్ డైరెక్టర్ డాక్టర్ విజయ్ బత్తిన, రోగులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

**టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ**



సిటీబ్యూరో, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : విద్యుత్ సేవల విషయంలో వినియోగదారులు పూర్తి స్థాయిలో సంతృప్తికరంగా ఉండేందుకు అధిక ప్రాధాన్యతనివ్వాలని టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. మంగళవారం డిస్కం పరిధిలోని ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో ప్రజలందరికీ నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, మెరుగైన సేవలను అందించడానికి అధిక ప్రాధాన్యతనివ్వాలని తెలిపారు. ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి విద్యుత్ సేవలు ఎలా ఉన్నాయో పర్యవేక్షించాలని, సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యతనివ్వాలని చెప్పారు. క్షేత్ర స్థాయిలో ఉండే అధికారులు తమ పరిధిలోని వినియోగదారులకు అందుబాటులో ఉండాలన్నారు. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు.

## జూన్ 28 నుంచి 'ఇన్‌సైడర్ ఎక్స్- 2024'

**వివరాలు వెల్లడించిన ఐఐఐడీ చైర్ పర్సన్ పల్లవి అంచూరి**




జూబ్లీహిల్స్‌లోని తాజ్ మహల్ హోటల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐఐఐడీ చైర్ పర్సన్ పల్లవి అంచూరి

బంజారాహిల్స్, డిసెంబర్ 19 : నిర్మాణ రంగంలో అత్యంత కీలకమైనది ఇంటీరియర్ డిజైనింగ్. ఆర్కిటెక్చర్‌తో పాటు ఇతర అన్ని విభాగాల్లో ప్రతిభకు మెరుగులు దిద్దడంతో పాటు అద్భుతమైన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ ఇంటీరియర్ డిజైనర్స్ (ఐఐఐడీ) ఆధ్వర్యంలో ఇన్‌సైడర్ ఎక్స్– 2024 పేరుతో ప్రతిష్టాత్మక ఈవెంట్‌ను నిర్వహించనున్నామని ఐఐఐడీ– హెచ్‌ఆర్సీ చైర్ పర్సన్ పల్లవి అంచూరి తెలిపారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని తాజ్‌మహల్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ ఆర్కిటెక్ట్ నిరూప్‌కుమార్ రెడ్డి తదితరులతో కలిసి పల్లవి అంచూరి మాట్లాడారు. వచ్చే ఏడాది జూన్ 28 నుంచి 30వ తేదీ వరకు మాదాపూర్‌లోని హైటెక్స్‌లో నిర్వహించనున్న 'ఇన్‌సైడర్ ఎక్స్' 5వ ఎడిషన్‌లో దేశంలోని అన్ని ప్రాంతాలనుంచి సుమారు 3వేలమంది ప్రతినిధులు హాజరుకానున్నారని, వీరిలో ప్రముఖ అర్కిటెక్ట్స్, బిల్డర్స్, ఇంటీరియర్ డిజైనర్లతో పాటు విద్యార్థులు ఉంటారన్నారు. ఎక్స్‌పోలో భాగంగా అర్కిటెక్చర్, ఇంటీరియర్ డిజైనింగ్ విద్యార్థులకు వర్క్‌షాపులు నిర్వహించి మెళకువలను నేర్పనున్నట్లు తెలిపారు. 150 ఎగ్జిబిటర్లతో పాటు 300 బ్రాండ్లు ఈ ఎక్స్‌పోలో పాల్గొని తమ ఉత్పత్తులను, లేటెస్ట్ ట్రెండ్స్‌ను ప్రదర్శించనున్నారని వివరించారు. ఈ సమావేశంలో ఎక్స్‌పో కన్వీనర్ రాకేశ్ వాసు, నవీన్‌కుమార్ చలసాని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎక్స్‌పోకు సంబంధించిన లోగోలను ఆవిష్కరించారు.

## ఆకట్టుకుంటున్న హై లైఫ్ ఎగ్జిబిషన్



సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్న పలువురు నటీమణులు, మోడల్స్

మాదాపూర్, డిసెంబర్ 19: మహిళలకు ఎంతగానో నచ్చేటువంటి వస్త్రాలు, ఆభరణాలు, గృహోపకరణ ఉత్పత్తులు హెచ్‌ఐసీసీ వేదికగా హై లైఫ్ ఎగ్జిబిషన్‌లో కొలువుదీరాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నటి స్రవంతి చొకారపు విచ్చేసి మోడల్ గీతా బట్లంకి, ప్రియాంక చౌదరి, పలువురు మోడల్స్‌తో పాటు నిర్వాహకుడు డొమినిక్‌తో కలిసి మంగళవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ నెల 21వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో దేశంలోని పలు నగరాలకు చెందిన ప్రముఖ డిజైనర్‌ల చేతుల మీదుగా రూపొందించిన ఫ్యాషన్ ఉత్పత్తులు, బంగారు ఆభరణాలు, గహోపకరణ ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు. అనంతరం మోడల్స్ నటీమణులతో కలిసి సెల్ఫీలు దిగుతు సందడి చేశారు.

## కుతుబ్ షాహీ టూంబ్స్ సందర్శన



నగరంలోని కుతుబ్ షాహీ టూంబ్స్‌ను సందర్శించిన యూఎస్ కాన్సులేట్, ఆగా ఖాన్ ఫౌండేషన్ ప్రతినిధులు

సిటీబ్యూరో, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని వారసత్వ కట్టడాల్లో ఒకటైన కుతుబ్‌షాహీ టూంబ్స్‌ను యూఎస్ కాన్సులేట్, ఆగా ఖాన్ ఫౌండేషన్ ప్రతినిధుల బృందం మంగళవారం సందర్శించింది. చారిత్రాత్మక వారసత్వ కట్టడమైన టూంబ్స్ పరిరక్షణ కోసం యూఎస్ ఎంబాసిడర్స్ ఫండ్‌ను ఆగా ఖాన్ ట్రస్ట్‌తో కలిసి వెచ్చించిందని ఆగాఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ ప్రాజెక్టు డైరెక్టర్ యశోవంత్ పురోహిత్ తెలిపారు. నగరంలో అత్యంత అందమైన కట్టడాల్లో ఒకటైన టూంబ్స్ పరిరక్షణలో భాగస్వాములైనందుకు సంతోషంగా ఉందన్నారు.

## ఆటోనగర్‌లో కెమికల్ దుర్వాసన

- బాధ్యులపై చర్యలు తీసుకుంటాం
- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, డిసెంబర్ 19 : ఆటోనగర్ పారిశ్రామిక వాడ నుంచి వస్తున్న కెమికల్ దుర్వాసనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి హిమపురికాలనీ ఫేజ్–1, 2, సెవన్ హిల్స్ కాలనీ, డీపీనగర్, ద్వారకానగర్, ఆటోనగర్ డంపింగ్ యార్డు తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం మార్నింగ్ వాక్ నిర్వహించిన ఆయన అక్కడి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. నూతన రోడ్లు, యూజీడీ, ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేయాలని, కాలనీల్లో విపరీతంగా ఉన్న కుక్కల బెడద నుంచి విముక్తి కల్పించాలని కాలనీలవాసులు ఎమ్మెల్యేను కోరారు. అదేవిధంగా గత సంవత్సరం మాదిరిగానే తిరిగి మళ్లీ ఆటోనగర్ పారిశ్రామిక వాడ నుంచి కెమికల్ దుర్వాసన వస్తుందని.. కెమికల్ దుర్వాసనతో ప్రజలు అనారోగ్యాల బారినపడుతున్నారని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆటోనగర్ పారిశ్రామిక వాడ నుంచి వస్తున్న కెమికల్ దుర్వాసనపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఐలా వారికి ఫిర్యాదు చేసి సమస్యను పరిష్కరింపజేస్తానన్నారు. ఆటోనగర్ డంపింగ్ యార్డు ప్రాంతంలో వేస్తున్న జంతు కళేబరాల డంపింగ్‌ను అరికట్టేందుకు నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆటోనగర్ పారిశ్రామిక వాడ నుంచి దిగువకు వరదనీరు వెళ్లేందుకు రూ.7 కోట్లతో ట్రంకులైన్ ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జక్కిడి మల్లారెడ్డి, పోచబోయిన జగదీశ్ యాదవ్, బాలరాజు, సిద్దగోని జగదీశ్ గౌడ్, మార్గం రాజేశ్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆటోనగర్ డంపింగ్ యార్డు ప్రాంతంలో సమస్యలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి